'ప్రభూ! నాకళ్ల ముందర ఒక పెద్ద కార్యక్రమం నాట్యమాడు తూందండి—'

'నిజమే శేషయ్యా? ఏదీ చెప్పు?'

'ప్రభూ! యుద్ధానంతరం మనం—'

'చెప్పు శేషయ్యా---ఏమిటదీ?'

'ప్రభూ! వ్రాసుకోండి ఆ పుస్తకంలో—యుద్ధానంతరం మనం చచ్చిపోతాం!'

## గాలి షికారు

'శేషయ్యా?'

'ప్రభూ!'

'చల్లగాలికి అలా కాసేపు తిరిగి వద్దాం వస్తావా?'

'ప్రభువుల మాటకి నేనెప్పుడేనా అడ్డు చెప్పానా?—పదండి—'

'ఎటువేపు వెడదాం?'

'తమ శలవ్-ఎటు వెళ్ళినా వెళ్ళవచ్చునండి-'

'కాలి నడకను వెడదామా, కారులో వెడదామా?'

'యెలా వెళ్ళినా వెళ్ళవచ్చునండి—'

'మళ్ళీ ఎంతసేపట్లో తిరిగి వద్దాం?'

'ఎంతసేపట్లోనైనా తిరిగి రావచ్చునండి—'

'పోనీ వెళ్ళడం మానేస్తే?'

'మానేస్తే మానెయ్యవచ్చునండి—'

'అయినా, కాస్సేపు అలా తిరిగివస్తేనే మంచిదేమో?'

'మంచిదే కావచ్చునండి—'

'అయితే వెడదామా?'

'వెడితే వెళ్లొచ్చునండి—'

'శేషయ్యా! దేవికూడా మనతోబాటు షికారుకి వస్తుందేమో?'

'వస్తే రావచ్చునండి—'

'ఆవిణ్ణికూడా మనతోబాటు కాస్త అలా చల్లగాలిలో తిరగనీయడం మంచిదే కాదూ?'

'మంచిదే కావచ్చునండి—'

'అయితే మనం 'మేము షికారుకు వెడుతున్నాం-వస్తే రావచ్చును' అని దేవికి కబురు చెయ్యాలి కదూ?'

'చెయ్యవచ్చునండి—'

'మనం కబురు చేసిన పిమ్మట ఆవిడ వస్తే వస్తానంటుంది, లేకపోతే రానంటుంది—అంతేకాదూ?'

'అంతేనండి—'

'వొస్తానంటే కూడా తీసుకువెడతాం—?'

'అంతేనండి—'

'రానంటే తీసుకు వెళ్ళం-ఏం?'

'అవునండి—'

'దేవికూడా వస్తే కారుమీద వెడితే బాగుంటుందా కాలి నడకను వెడితే బాగుంటుందా?'

'యెలా వెళ్లినా బాగానే వుంటుందండీ—'

'అయినా, కారుమీద వెడితేనే బావుండేలావుంది; దేవి పాదాలు శ్రమకు అలవాటుపడినవి కావు-ఏమంటావ్ శేషయ్యా?'

'మీరు చెప్పింది నిజమేనండి-'

'రైట్! అయితే డ్రైవరుకి కబురుచెయ్యి కారు తీసుకు రమ్మని?'

'అతనింకా వచ్చి వుండడండి-'

'ఎక్కడికి కెళ్ళాడూ?'

'దేవిగారిని గాలి షికారుకి తీసికెళ్లాడండి?'